

# అమెరి'కులాసా' కథలు

## – వంగూరి చిట్టెన్ రాజు



## -36-

## గణతంత్ర దినోత్సవాలూ- గవర్నర్ ల ప్రసంగాలూ

**మొన్నటి జనవరి** 26, 2020 నాడు మన పవిత్ర భారత దేశం లోనే కాక, ఇక్కడ అమెరికాలో అనేక దౌత్య కార్యాలయాలూ, ఇండియా సంఘాలూ, ఇండియా రాజకీయ పార్టీల అమెరికా విభాగాలూ..ఇలా చాలా చోట్ల మన 71వ గణతంత్ర వేడుకలు కొన్ని చోట్ల 'ఘనం'గానూ, మరి కొన్న చోట్ల 'గనం' గానూ జరిగాయి. ఒత్తూ 'ఘనం' గా అంటే....అక్కడ జవానులు, ఎన్.సి.సి. వాళ్ళూ, పోలీసులూ వగైరాల కవాతు ప్రదర్శనలతో ఆర్భాటంగా జరిగాయి అని అర్థం. అలాంటివి అమెరికాలో కుదరవు కనక ఇక్కడ ఒత్తు లేకుండా ఉత్తుత్తినే 'గనం' గా జరిగిన వాటిల్లో కేకులు 'కత్తిరించుకుని' ఒకరికొకరు తినిపించుకుని ఎవరి మూతి వాళ్ళే తుడుచుకుంటారు. మా చిన్నప్పుడు మా హైస్కూల్ లో కుర్ర వెధవలందరినీ..అంటే నా బోటి గాళ్ళకి మంచి బట్టలు వేసి, అలవాటు లేని కంఠలంగోటీలు కట్టి, ఎక్కడో ఉన్న పురపాలక సంఘం కార్యాలయానికో, మరెక్కడో ఉన్న కలెక్టర్ గారి బంగళా కో "తోలు' కెళ్ళే వారు. అది నిజంగానే తోలు కెళ్ళడం..ఎందుకంటే గేదెలనీ, మేకలని తోలేవాళ్ళ దగ్గర కర్రలు ఉన్నట్టు మేష్టర్ల చేతుల్లో బెత్తాలు ఉండేవి. ఇక జెండా వందనం అయ్యాక, మ్యునిసిపల్ చైర్మన్ అయితే పంచె కట్టుకుని తెలుగులోనూ, కలెక్టర్ గారు అయితే సూటూ, బూటూ వేసుకుని ఇంగ్లీష్ లోనూ గాంధీ గారూ, అంబేద్కరూ, నెహ్రూ, పటేళ్ళ గురించి మాట్లాడేసి మమ్మల్ని ఆ మర్నాటి నుంచీ వాళ్ళ లా ఉండమని గొంతు చించుకుని ఘోషించి, అప్పటికి నడిచి, నడిచి ఆయాస పడుతున్న మాకు బిళ్ళలూ, చాక్ లెట్లూ పంచి పెట్టేవారు. అయితే ఆ రోజుల్లో టీవీలు లేవు కాబట్టి ఎక్కడో ఢిల్లీ లో నెహ్రూ గారు మాట్లాడిన ప్రసంగాన్నీ, హైదరాబాద్ లోనో మరెక్కడో గవర్నర్ గారి గణతంత్ర ఉద్బోధనీ మర్నాడు పేపర్లో చవదవడమో, మహా అయితే రేడియోలో పెద్ద వాళ్ళతో పాటు వినడమో చేసేవాళ్ళం. ఈ ఉపోద్ఘాతం అంతా ఇప్పుడు ఎందుకూ అంటే...ఇప్పుడు ఈ వెధవ టీవీలు వచ్చి పడ్డాయి. పైగా ఎక్కడో ఆంధ్రాలో విజయవాడలో గవర్నర్ గారు కవాతు ప్రదర్శన చూసి, ప్రసంగించడం "బతికుండగా"...అంటే "లైవ్" చూస్తూ. వినే భాగ్యం నాకు కలిగింది. దాన్ని దౌర్భాగ్యం అనాలో, సౌభాగ్యం అనాలో అనుకుంటూ ఉండగా "అసలు ఏమీ అనకుండా మూసుకుని విను" అంది మా క్వీన్ విక్టోరియా.

ఇక ఈ ఏటి జెండా వందనం కార్యక్రమం విజయవాడలో జరిగింది. కవాతు ప్రదర్శన, జెండా అవిష్కరణ వగైరా తంతుల సమయం లో రాష్ట్ర ముఖ్య మంత్రి వర్యులు వేదికని అలంకరించారు. ఇక గవర్నర్ గారు ప్రసంగ వేదిక దగ్గరకి వెళ్ళగానే ఆయనకి ఎవరో పది పదిహేను కాగితాల కట్ట ఇచ్చి "ఇది చదువు" అని ఆదేశించినట్టుగా నాకు స్పష్టంగానే అర్థం అయింది. ఆ పెద్ద మనిషి కూడా ఏమీ

మొరాయించకుండానే అది చదవడం మొదలుపెట్టారు. మన రాచరిక, ప్రజాస్వామ్య సాంప్రదాయాలని బట్టి, ఇటువంటి సందర్భాలలో గవర్నర్ గారు రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు వ్రాసి ఇచ్చిన ప్రసంగాన్నే చదవాలి కానీ సొంత బుర్ర వాడడం నిషిద్ధం. ఇప్పుడు కూడా జరుగుతున్నది అదే.

మన గవర్నర్ గారి పేరు బిశ్వభూషణ్ హరిచందన్. ఆ పేరుని బట్టి ఆ మహానుభావుడు బెంగాలీ యో ఒరియా అనుకున్నాను కానీ మరీ అంత డేమేజ్ చేస్తారు అనుకోనే లేదు. మొత్తం ప్రసంగం అంతా వింటే పాపం జగన్ మోహన్ రెడ్డి గారి మీద విపరీతమైన జాలి కలిగింది. పాపం ముఖ్యమంత్రి గారు చెప్పదల్చుకున్న దానికీ, గవర్నర్ గారు చెప్పిన దానికీ ఎక్కడా పొంతన కుదర లేదు సరికదా..జగనన్న ప్రవేశపెట్టిన అన్ని ప్రజా సంక్షేమ పథకాలకీ అర్థం మారి పోయింది. అది మరి నా ఒక్కడికే అలా అనిపించిందేమో నాకు తెలియదు. గవర్నర్ గారు ముందు మూడు రాజధానుల గురించి ప్రస్తావించారు. అదింకా మొదటి దశలోనే ఉంది. ఆ తరవాత ఆయన ఎంతో గర్వంగా ప్రభుత్వం అమలు లోకి తెచ్చిన "అమ్మ బోడి పథక్' గురించి చెప్పగానే నాకు అమ్మని పట్టుకుని బోడి ది అంటాడేమిటా అని విస్తుపోయాను. పైగా ప్రతీ అమ్మ బోడికీ పదిహేను వేల రూపాయలు ఇస్తానంటాడేమిటీ. ఇదేమన్నా కందుకూరి వీరేశలింగం గారి తాలూకు వితంతు సంక్షేమ పథకమా అనే అనుమానం వచ్చేసింది. అప్పుడు మా క్వీన్ విక్టోరియా నన్ను ఒక టెంకి జెల్ల కొట్టగానే "పాపం అమ్మ వొడి పథకానికి  ఆ ఒరియా గవర్నర్ గారి చేతిలో పట్టిన గతి అని  నాకు విషయం అర్థం అయిపోయింది. పాపం జగనన్న అమ్మ వొడి!

ఇహ చూసుకోండి నా సామి రంగా....ఆ తరవాత గంట సేపు సాగిన ప్రసంగం అంతా చమత్కారాల మీద చమత్కారాలే. ఆటో రిక్షాల వారి కోసం అనుకుంటాను, ప్రభుత్వం వారి 'బోహన మూత్ర ' అనే పథకం లో ప్రతీ డ్రైవర్ కీ పది వేలు ఇచ్చి, ఐదు వేలు ట్రాఫిక్ ఫైన్ లు పెంచుతారుట. "కంటె భెలుగు' క్రింద రెండున్నర కోట్లు, "పంటె నొప్పూలూ, శెభీ వినుకుడూ' క్రింద మరి కొన్ని కోట్లూ ఖర్చుపెడతారట. 'జగన్ బచావో బతికావ్, లేదా చచ్చావ్" క్రింద ప్రతీ గ్రామ పంచాయితీ లోనూ ఒకటా, రెండా ఏకంగా 500 గ్రామ సేవలు అందుబాటు లోకి వచ్చాయిట. 'శౌణా భుజన్" క్రింద అందరికీ సన్న బియ్యం సరఫరా జరుగుతుందిట. 'స్థానిక్ ఒద్యోగ్" క్రింద 75 శాతం ఉద్యోగాలు లోకల్ వాళ్ళకే వచ్చే దారిలో ఉన్నాయిట, "ఇంగ్లీష్ ఇంపూ, తెలుగు షంపూ' క్రింద అన్ని పాఠాశాలలోనూ ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టడమే కాక తెలుగు ని ఇంగ్లీష్ లో నేర్చుకోవడం కంపల్ సరీ చేస్తారుట, 'రౌత్ భౌఱోషా" క్రింద రైతులకే కాక కౌలు దారులకి కూడా పన్నెండు వేలు ఇస్తారుష,

ఇక "ధౌఱోళ సిటీ కౌరోనా" అనే పథకం గురించి గవర్నర్ గారు ప్రస్తావించిన అంశం అదేదో చైనా నుంచి దిగుమతి అవుతున్న కరొనా వైరస్ గురించి  అనుకు ఆ వైరస్ ని జగన్ గారు ఎలా నివారిస్తారా అని నేను ఆసక్తికరంగా విన్నాను కానీ అది "ధరల స్థిరీకరణ" అనీ, దానికి జగన్ గారు మూడు కోట్లు కేటాయించి ఉల్లి పాయ, టొమేటో ల మీద ప్రత్యేక కమిటీ వేస్తారు అనీ గవర్నర్ గారు చెప్పదల్చుకున్నారని అర్థం అయింది.

ఇక అన్నింటికన్నా నాకు విపరీతమైన ఆశ్చర్యం కలిగించిన అంశం ఆంధ్రా గవర్నర్ గారైన ఒరియా ఆయన భాషాదోషాలు కాదు కానీ తమిళం వారైన తెలంగాణా గవర్నర్ గారి ప్రసంగం లో ఒక అంశం. ఆమె ప్రసంగం కూడా పూర్తిగా "బతికుండగానే" విన్నాను. ""యెవ్వెరి పైసా", 'పల్లె ప్రగదీ" 'కేసీఆర్ కిట్టూ'' లాంటి భాషా పరమైన ఇబ్బందులు ఆవిడకీ ఉన్నాయి కానీ ఎంతయినా దక్షిణాది మనిషే కనక ఆంధ్రాకి జరిగినంత అన్యాయం తెలంగాణాకి జరగ లేదు. అయితే "తెలంగాణాలో జరిగిన మాన భంగం దౌర్జన్యాలు పక్క రాష్ట్రాల వారికి స్ఫూర్తిగా నిలిచి 'దిశ చట్టం" లాంటి మంచి చట్టాలు చేయడానికి ఆస్కారం కలిగింది" అని తెలంగాణా గవర్నర్ చెప్పడం విని నిర్ఘాంతపోయాను. అప్పటికే ఆంధ్రా ప్రసంగం విని బుర్ర తిరుగుతున్న నాకు బహుశా తెలంగాణా ప్రసంగం లో ఆ వాక్యాలు నేను తప్పు గా విన్నాను అనే అనుకుంటున్నాను.

ఏది ఏమైనా ......71 గణతంత్ర దినోత్సవం సందర్భంగా భారత దేశం సాధిస్తున్న పురోగతికి సంతోషంగానే ఉంది. సాధించవలసినది ఇంకా ఎంతో ఉంది అని అందరికీ తెలిసినదే!

**COMMENTS**